# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ నూతన మద్యం విధానంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు సమావేశమైంది.

❖ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం రేపు అమరావతిలోని సచివాలయంలో జరగనుంది.

❖ "విశాఖ రైల్వే జోన్"కు త్వరలోనే భూమి పూజ జరుగుతుందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.

❖ ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణం కోసం "స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు.

==============================

రాష్ట్రంలో నూతన మద్యం విధానంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు సమావేశమైంది. అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్ పాత్రికేయులతో మాట్లాడుతూ... మద్యం విధానంపై క్షేత్రస్థాయిలో వివిధ సంఘాల నుంచి నివేదికలు తెప్పించుకున్నామని, రేపు జరిగే మంత్రి వర్గ సమావేశంలో ఆ నివేదికలను సమర్పిస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యాన్ని అమ్మడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవడంతో పాటు.. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని దారి మళ్లించి అబ్కారీ శాఖలో అవినీతికి పాల్పడ్డారని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==============================

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం రేపు జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారని అధికారవర్గాలు తెలిపాయి. రేపు ఉదయం 11 గంటలకు

అమరావతిలో సచివాలయంలో ఈ సమావేశం జరుగనుంది. నూతన మద్యం విధానానికి సంబంధించి ఈ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలపై చర్చించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎన్డీయే కూటమి శాసన సభ్యుల ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ వంద రోజుల పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు.. భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి.

================================

విశాఖ రైల్వే జోన్‌కు త్వరలోనే భూమి పూజ జరుగుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.  ఈరోజు వందేభారత్ ఎక్స్ ప్రెస్ లో అభిమానులతో కలిసి ఆయన ప్రయాణించారు. ఈ సందర్భంగా ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో ఆయన మాట్లాడుతూ...  ఒక్కప్పుడు ఉత్తరాంధ్ర నుంచి ఇతర ప్రాంతాలకు రైలు ప్రయాణమంటే ఇబ్బందులు ఉండేవని... అలాంటిది ఇప్పుడు ఉత్తరాంధ్రలో అత్యున్నత వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు 4 నడుస్తున్నాయని తెలిపారు. జూన్ 2026 నాటికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలియజేశారు.

================================

ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన “స్వచ్ఛతా హీ సేవా” కార్యక్రమాన్ని అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని  కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ   తెలిపారు. “స్వచ్ఛతా హీ సేవా” కార్యక్రమాన్ని ఈరోజు ఆయన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... 2014లో నరేంద్ర మోదీ “స్వచ్ఛ భారత్” కార్యక్రమాన్ని ప్రాంభించారని, దేశ వ్యాప్తంగా దీనికి మంచి స్పందన లభించిందన్నారు. “స్వచ్ఛ భారత్” కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలని, దీనిలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

================================

విశాఖలో 4 సంవత్సరాల క్రితం ఎల్జీ పాలిమర్స్ కంపెనీలో జరిగిన గ్యాస్ లీకేజ్ దుర్ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ... ఆ సంస్థ యాజమాన్యం 120 కోట్ల రూపాయలు సహాయం చేసేందుకు ముందుకొచ్చింది. ఎల్జీ పాలిమర్స్ కార్పొరేట్ ప్రతినిధులతో విశాఖ జిల్లా కలెక్టరేట్ లో విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్, విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గణబాబుతో కలిసి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈరోజు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. 120 కోట్ల రూపాయల సహాయాన్ని 2 విడతల్లో 60 కోట్ల రూపాయల చొప్పున ప్రకటించారు. మొదటి విడత కింద 60 కోట్ల రూపాయలు  వారం రోజుల్లోగా ధన రూపంలో బాధితులకు అందజేస్తామని కంపెనీ ప్రతినిధి తెలిపారు. రెండో విడతలో 60 కోట్ల రూపాయలతో ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి నష్టపోయిన గ్రామాల ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లు చేస్తారని ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే గణబాబు తెలియజేశారు.

================================

దైవిక వాస్తు శిల్పి అయిన  విశ్వకర్మ పుట్టినరోజును ప్రతి సంవత్సరం సెప్టెంబరు 17న విశ్వకర్మ జయంతి వేడుకగా నిర్వహించుకోవడం జరుగుతోందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీ కృష్ణుడు పరిపాలించిన పవిత్రమైన ద్వారక నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజభవనాన్ని నిర్మించిన గొప్ప సృష్టికర్త అని అన్నారు.

ఆదే విధంగా కులవృత్తి గొప్పదనాన్ని, వైభవాన్ని, జీవనాధారాన్ని పెంపొందించడమే శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి ప్రధాన ఉద్దేశ్యమని వైయస్సార్ జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు.

==============================

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మంజూరైన గృహాల లబ్ధిదారులకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఇంటి తాళాలను అందజేశారు. ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుండి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ "ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0" మార్గదర్శకాలను దృశ్య మాధ్యమ విధానంలోఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి కలెక్టర్ విజయ క్రిష్ణన్, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, ఇతర ఉన్నతాధికారులు, గృహాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

==============================

అన్నమయ్య జిల్లా రామాపురం మండలం మేదరపల్లి చెక్ పోస్టు వద్ద ఈరోజు తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 30 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వేలూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సును కడప నుంచి రాయచోటి వైపు సిమెంట్ బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న రామాపురం పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి క్షతగాత్రులను కడప, రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

==============================

విశాఖపట్నం నుంచి ఈరోజు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్ ప్రెస్ ఈరోజు సాయంత్రం 6 గంటల 50 నిమిషాలకు రీ షెడ్యూల్ చేశారు. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తున్న కారణంగా ఈ మార్పు చేశామని రైల్వే అధికార వర్గాలు ఈరోజు ఒక ప్రకటనలో తెలియజేశారు.

==============================

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై ఏకాగ్రత సాధించగలుగుతారని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని జామి మండలం కుమరాం కె.జి.బి.వి పాఠశాలలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఈరోజు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి 6 నెలలకు ఒక సారి అల్బెండజోల్ మాత్రలు విద్యార్ధులు తీసుకోవాలని, చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తూ.. ఆరోగ్యంగా ఉండాలని.. ప్రతి విద్యార్థికి ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

==============================

పరిసరాల పరిశుభ్రత పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని మనందరి సామాజిక బాధ్యత అని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈరోజు ఆయన "స్వచ్ఛతా హీ సేవా" ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలు పరిశుభ్రతపై చైతన్యవంతమైతే భారత దేశం.. పరిశుభ్రమైన దేశంగా మారుతుందన్నారు. జిల్లాలోని 3 ఐటిడిఏల పరిధిలో "స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతీ కళాశాలలోను, పాఠశాలలోను పరిశభ్రతకు కొంత సమయం కేటాయించాలని చెప్పారు.

==============================
==============================